విశాలాంధ్ర
ప్రాంతీయం
గుంటూరు, బాపట్ల, పల్నాడు

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

విశాలాంధ్ర-ఈపూరు : విద్యార్థి దశ నుంచే క్రీడలు పట్ల ఆసక్తి పెంచుకోవడం ద్వారా ఉజ్వల భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవచ్చని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చుండు వెంకట్రావు అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 12 వరకు నిర్వహించిన అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో ముప్పాళ్ళ గ్రామానికి చెందిన ధనలక్ష్మి వ్యాయామ కళాశాలలో బీపీఈడీ మొదటి సంవత్సరం చదువుతున్న టి.పద్మ ప్రణీత 100 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం, 200 మీటర్ల రన్‌లో బంగారు పతకం, బీపీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న డి.రాజా వర్మ షాట్ పుట్‌లో రజత పతకం సాధించినట్లు వివరించారు. నాగార్జున విశ్వవిద్యాలయం జట్టుకు పద్మ ప్రణీత ప్రాతినిధ్యం వహించి తమిళనాడులోని ఫిజికల్ ఎడ్యుకేషనల్ యూనివర్సిటీలో 10 జనవరి 2023 తేదీ నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ప్రిన్సిపల్ బుధవారం తెలిపారు. విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ మేదరమెట్ల రామశేషగిరిరావు అధ్యాపకులు వై.సురేష్, ఎం.సురేష్ కుమార్, ఆర్.బలరాం నాయక్, ఎం.దాసు తదితరులు అభినందించారు.

రక్తదానంతో ప్రాణదానం చేయండి

విశాలాంధ్ర-తాడేపల్లి : అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని కేఎల్ విశ్వవిద్యాలయం సలహాదారు, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ హబీబుల్లాఖాన్ అన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని సాక్ హాలులో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని అన్నారు. 18 సంవత్సరాలు దాటిన వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అసోసియేట్ డీన్ డాక్టర్ కె.రూతు రమ్య పేర్కొన్నారు. రక్తదానం పట్ల అపోహలను తొలగించుకోవాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ రెడ్డి వివరించారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు 114 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారని తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ కె.కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ ఐఎస్ శర్మ రక్తదాతలకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధివర్మ, ప్రో.వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.జగదీష్, సాక్ డైరెక్టర్ పి.సాయి విజయ్, అడ్వైజర్ డీన్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, డీన్ విద్యార్థి సంక్షేమ అధిపతి డాక్టర్ సిహెచ్ హనుమంతరావ, పి.సురేష్, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు శావల్యాపురం విద్యార్థిని

విశాలాంధ్ర-శావల్యాపురం : రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు స్థానిక జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎంపికైనట్లు పీడీ రాగుల రాధాకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 9న చేబ్రోలు మండలం శేకూరు జడ్పీ స్కూల్లో జరిగిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలలో అండర్-17 యోగా విభాగంలో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నామినేని హేమపూజిత అత్యున్నత ప్రతిభ కనబరచి ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 17వ తేదిన వైఎస్సార్ కడప జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరపున పాల్గొంటారని తెలిపారు. హేమపూజితను పీఎంసీ చైర్మన్ ముట్లూరి ప్రసాదు, ఇంచార్జి హెచ్ఎం జె.శ్రీనివాసరావు, బీవీ నాగేశ్వరరావు, రవికుమార్, కిషోర్, అబ్దుల్లా, నిర్మల, హబీ, సువర్చల, హలిమా, నాగమల్లేశ్వరి, సీఆర్పీ శివప్రసాద్ అభినందించారు.

స్కూల్ గేమ్స్ రాష్ట్ర జట్టుకు గీతమ్స్ విద్యార్థి

విశాలాంధ్ర-వినుకొండ : ఈ నెల 13వ తేదీన నిడమూరు జడ్పీహెచ్ స్కూల్లో జరిగిన అండర్-14 ఖో ఖో సెలక్షన్స్‌లో పట్టణానికి చెందిన గీతమ్స్ హైస్కూల్ విద్యార్థి ఎస్.ప్రమోద్(8వ తరగతి) రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడని పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణవేణి తెలియజేశారు. ఎంపికైన విద్యార్థి కర్నూలు జిల్లాలోని ఆత్మకూరులో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొంటాడని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రమోద్‌ను గీతమ్స్ విద్యాసంస్థల కరస్పాండెంట్ మాలపాటి కోటిరెడ్డి, ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వ్యాయామ ఉపాధ్యాయులు డి.అశోక్, టి.భాను ప్రకాష్, డి.శ్యాంబాబు, ఎస్‌కే మెహరున్నిసా తదితరులు పాల్గొన్నారు.

కోలుకోని వరి, పత్తి రైతు

విశాలాంధ్ర-తాడికొండ : మాండస్ తుఫాను ప్రభావంతో వరి, పత్తి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. నిత్యం కురుస్తున్న వర్షాల వల్ల రైతులు కుదేలు అవుతున్నారు. ఏటామాదిరిగానే ఈ ఏడాది కూడా మండలంలో వరి 674 ఎకరాలలో, పత్తి 18479 ఎకరాలలో సాగు చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి వరి పంట దెబ్బతింది. కొన్నిచోట్ల వరి ఓదెలు దెబ్బతిన్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు పంట పొలాల్లో ఉన్న నీటిని బయటకు తోడి వేస్తున్నారు. అలాగే వర్షం దాటికి పత్తి పంట సైతం దెబ్బతింది. వీటివల రైతులు కొద్దిపాటి పత్తిని తీశారు.మాండస్ వర్షం ధాటికి వరి, పత్తి పంట దెబ్బతిన్నదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నరేంద్ర మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలి



విశాలాంధ్ర-గుంటూరు : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, పొన్నూరు మాజీ శాసన సభ్యులు దూళిపాళ్ల నరేంద్ర జన్మది నోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ నరేంద్రను చింతలపూడిలోని ఆయన నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మంచి పదవులు అధిరోహించాలని ప్రభాకర్ ఆకాంక్షించారు. ఒక సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన నరేంద్ర ఐదు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి చరిత్ర సృష్టించారని కొనియాడారు.

భాష్యంలో ఇంట్రా డ్యాన్స్ పోటీలు



విశాలాంధ, పిడుగురాళ్ల: పట్టణంలోని భాష్యం హైస్కూల్ ఆవరణలో బుధవారం ఇంట్రాడాన్స్ మీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్‌ఈఓ హృదయరాజు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు డ్యాన్స్ పోటీలు నిర్వహించి , గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ జోజయ్య, ఉపాధ్యాయులు వెంకట్, సుబ్రమణ్యం, తదితరులుపాల్గొన్నారు.

రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర-బొల్లాపల్లి : మాండస్ తుఫాన్ కారణంగా పంట తీవ్రంగా నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం వెంటనే చెల్లించాలని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతివరప్రసాద్ డిమాండ్ చేశారు. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామ పరిధిలో మాండస్ తుపాను వలన దెబ్బతిన్న వరి పంట, మెట్ట పంట పొలాలను బుధవారం సీపీఐ బృందం పరిశీలించింది. అనంతరం మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వరి పంట నేల వాలి నీట మునిగిందని, పండిన పంటను ఓదెలుగా కోసి ఆరబెట్టిన పంట పూర్తిగా నీటిలో మునిగిపోయి మొలకలు ఎత్తే పరిస్థితి వచ్చిందన్నారు. రైతన్న విలవిలాడిపోతున్నాడని నష్టపోయిన రైతాంగానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎకరానికి రూ.25 వేలు ఇచ్చి రైతును ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పత్తి, మిర్చి, కంది, మొక్కజొన్న లాంటి వాణిజ్య పంటలు నీటిలో మునిగి ఉరకవేసి పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని రైతు బోరున విలపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

మిర్చి, పత్తి, పొగాకు, అపరాల పంటలకు ఈ తుఫాను వలన తీవ్ర నష్టం వాటిల్లిందని ఈ మెట్ట పంటలకు ఎకరానికి రూ.50 వేలు చొప్పున రైతుకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తుఫాను వలన పాడైపోయిన వరి ధాన్యాన్ని పూర్తిగా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ సుభాని, సీపీఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నెబోయిన వెంకటేశ్వర్లు, సీపీఐ నాయకులు కొండ్రముట్ల చిన్న సుభాని, షేక్ మస్తాన్, ఏఐవైఎఫ్ నాయకులు అజయ్, కె.మల్లికార్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు హక్కులు సాధించుకోవాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కార్మికులు ఐక్యంగా ఉంటూ హక్కులను సాధించుకోవాలని ఏఐటీయూసీ అనుబంధ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బందెల రవి తెలిపారు. సీపీఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల విషయంలో ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. పట్టణాల్లో పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణలో ముఖ్యమైన పాత్రను కార్మికులు పోషిస్తున్నారని తెలిపారు. విషకాలుష్యంలో నిత్యం ప్రాణాలకు తెగించి పనిచేస్తున్నారని వివరించారు. అటువంటి కార్మికుల న్యాయమైన సమస్యల పట్ల నిర్లక్ష్యభావం తగదని సూచించారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి వైసీపీ ప్రభుత్వం మోసగించిందన్నారు. పైగా ఆప్కాస్ పెట్టి కార్మికులకు శాశ్వత ఉద్యోగాలు రాకుండా కుట్ర పన్నిందని విమర్శించారు. హెల్త్ అలవెన్సు, జీతాలు బకాయిలు అందజేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని కోరారు. చిలకలూరిపేటలో 100 పడకల ఈఎస్ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని అన్నారు. పారిశుధ్య కార్మికులను శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఒత్తిడికి గురిచేస్తున్నాడని, మున్సిపల్ కమిషనర్ వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ ఏరియా కార్యదర్శి నాగభైరు రామసుబ్బాయమ్మ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి బాబురావు, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు పేలూరి రామారావు, బొంతా భగత్‌సింగ్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చిలకలూరిపేట శాఖ నాయకులు కె.చెంచయ్య, యోగయ్య, జయరావు, కొండమ్మ, బాలకోటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములపై అసత్య ఆరోపణలు తగవు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : శ్రీ మోహనరంగ నాయక దేవస్థానం భూములు అన్యాక్రాంతానికి గురైయ్యాయని నిరూపిస్తే రాజకీయల నుంచి తప్పుకుంటానని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) సవాల్ విసిరారు. టీడీపీ నేతలు హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా రాజకీయాలు చేయాలని చూస్తే సహించేదిలేదని హెచ్చరించారు. స్థానిక బ్రాడీపేటలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆచారి మాట్లాడుతూ, దశాబ్దాల క్రితం శ్రీ మోహనరంగ నాయక దేవస్థానానికి చెందిన భూములు అన్యాక్రాంతానికి గురైతే అప్పటి అధికారులు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తే తీర్పు కూడా న్యాయం వైపు నిలబడిన విషయం తెలుసుకోకుండా 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం తగదన్నారు. దేవస్థానానికి కమిటీ ఉందని, నిరంతరం పర్యవేక్షణ చేస్తుందన్నారు. వైసీపీ సీనియర్ నేత తాడేపల్లి విజయకృష్ణ మాట్లాడుతూ టీడీపీ నేతలు అసత్య ప్రచారాలు మనుకోకపోతే రాజకీయంగా అడ్రసులు గల్లంతౌతాయని హెచ్చరించారు. మన్నెపల్లి హనుమంతరావు శర్మ, శ్యామ్ పాల్గొన్నారు.

బీజేపీపై యుద్ధానికి సిద్ధం కావాలి

విశాలాంధ్ర-వినుకొండ : ఎనిమిదేళ్ళుగా దేశాన్ని పాలిస్తూ మాదిగలకు ఇచ్చిన మాటను నెరవేర్చకుండా ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల నిర్లక్ష్యం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై ప్రత్యక్ష యుద్దానికి మాదిగ సమాజం సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిరుగూరి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేమూరి సుధీర్ మాదిగ, అద్దంకి బాబు మాదిగ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన కోసం 28 ఏండ్లుగా మాదిగ జాతి అలుపెరుగని పోరాటం చేస్తుందని అన్నారు. కానీ పాలకులకు చిత్తశుద్ధి, నైతిక నిబద్ధత లేని కారణంగా వర్గీకరణ జరగడం లేదని అన్నారు. ఎస్సీ వర్గీకరణను మేనిఫెస్టోలో చేర్చుకొని అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పరిష్కారం చేస్తామన్న బీజేపీ నమ్మించి మోసం చేసిందని అన్నారు. నమ్మిన వాళ్లకు మోసం చేయడం బీజేపీ సహజ నైజమని అన్నారు. బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీజేపీ నిర్లక్ష్యం మాదిగ జాతికి శాపంగా మారిందని, బీజేపీ మెడలు వంచేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉద్యమ నిర్మాణంలో మాదిగ యువకులు, విద్యావంతులు పెద్దఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. బెంగుళూరులో జనవరి 6న ఎమ్మార్పీఎస్ జాతీయ మహాసభను నిర్వహిస్తున్నామని, ఆ సభ అనంతరం ప్రత్యక్ష పోరాట కార్యాచరణను మంద కృష్ణ మాదిగ ప్రకటిస్తారని అన్నారు.

బహుళ అంతస్తుల నిర్మాణాలకు నిర్దేశిత ధృవపత్రాలతోనే అప్‌లోడ్ చేయాలి



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: నగరంలో నూతన బహుళ అంతస్తు నిర్మాణాలకు లైసెన్స్ టెక్నికల్ పర్సన్స్ (ఎల్.టి.పి.)లు తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలతోనే డి.పి.ఎం.ఎస్.లో అప్ లోడ్ చేయాలని, లేకుంటే తగు చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. బుధవారం కమిషనర్ గోరంట్ల, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్.ఓ.సి.కి దరఖాస్తు చేసుకున్నభవనాలను లేజర్ మెజరింగ్ మెషిన్ ద్వారా పరిశీలించి పట్టణ ప్రణాళిక అధికారులకు తగు ఆదేశాలు జారి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్ లైన్ ద్వారా డి.పి.ఎం.ఎస్.లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువ పత్రాలు, నిబందనలకు అనుగుణంగా ప్లాన్ కోసం దరఖాస్తు చేయాలని, లేకుంటే తదుపరి అనుమతుల జారీ నిలిపివేయడం జరుగుతుందన్నారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగానే భవన నిర్మాణ అనుమతులు ఇవ్వాలని, లేని వాటిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. పర్యటనలో సిటి ప్లానర్ మూర్తి, ఏ.సి.పి.లు అజయ్ కుమార్, బాబురావు, టీ.పి.ఎస్.లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: ఎంతో విలువైన విద్యుత్‌ను పొదుపుగా వినియోగించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి ఇంధన శాఖ అధికారులకు సూచించారు. బుధవారం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్ ఇంధన పరిరక్షణ మిషన్, ఇంధన శాఖ వారు రూపొందించిన స్టిక్కర్లు, కరపత్రాలు, ప్రచార పోస్టర్లను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, గుంటూరు నగరపాలక సంస్థ కమీషనర్ కీర్తి చేకూరితో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 14 నుండి 20 వ తేది వరకు జరిగే జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా విద్యుత్ వృధాను అరికట్టడం, విద్యుత్ ఉప కరణాలు ఉపయోగించే మెళుకువలతో పాటు ఇంధన పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంధన శాఖ అధికారులకు సూచించారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ఎన్‌జిఓలను, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీసిపిడిసిఎల్ ఎస్.ఇ మురళి కృష్ణ యాదవ్, ఎస్.ఇ ఆర్అండ్‌బి నిర్మల, ఎస్.ఇ జిఎంసి భాస్కర రావు, ఇ.ఇ శ్రీనివాస బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

నవశకానికి నాంది 'నవరత్నాలు'

విశాలాంధ్ర-రెంటచింతల : నవరత్న పథకాలతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నవశకానికి నాంది పలికారని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రాష్ట్ర ప్రజల్లో సంతృప్తి నెలకొందని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని తుమృకోట గ్రామంలో ఆయన బుధవారం నాల్గవ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలసి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఇప్పటివరకు ఏయే పథకాలు ద్వారా ఎంతెంత అందాయో అని ప్రతి కుటుంబాన్ని ఆయన అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు క్రమం తప్పకుండా లబ్ధిదారుల ఇంటి వద్దకు వలంటీర్లు వెళ్లి అందజేస్తున్నారన్నారని, జనవరికి రూ.2750 పింఛన్ ఇవ్వడానికి క్యాబినెట్ ఆమోదం తెలిపిందని గుర్తుచేసారు. అలాగే కార్డుదారుల ఇంటి వద్దకు రేషన్ సరుకులు వస్తున్నాయని గుర్తుచేశారు. అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తున్నామని, ఆరోగ్యశ్రీకి పూర్వవైభవం తీసుకొచ్చామని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మీరావత్ నల్ల బాలునాయక్, శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, నవులూరి భాస్కర్ రెడ్డి, దాసరి చౌడేశ్వరి, ఏరువ శౌర్రెడ్డి, షేక్ గౌసియాబేగం, కె.పుల్లారావు, గొట్టం చిన్న బ్రహ్మారెడ్డి, ఉమామహేశ్వర రెడ్డి, పోట్ల ముత్తయ్య, నల్లబోతుల మల్లయ్య, పోట్ల శ్రీనివాసరావు, కారంపూడి నన్నె, మహ్మద్ షరీఫ్, షేక్ సైదావలి, షేక్ జానీభాష, కర్రా సత్యానందం, లాజర్, మేకల మల్లయ్య, మేకల గోపి, సత్యాలు, ఉపేంద్ర, ముక్కా శ్రీను, కె.లింగయ్య, ఎన్.చంద్రయ్య, కె.శేషయ్య, పీఆర్ఎఈ పాశం శ్రీనివాసరెడ్డి, ఏపీ ట్రాన్స్ ఏఈ మస్తాన్‌వలి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కె.నరేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికి పరిహారం అందేలా కృషి చేయాలి

విశాలాంధ్ర - భట్టిప్రోలు : తుఫాన్ ప్రభావంతో వరి పంటను నష్టపోయిన ప్రతిఒక్క రైతుకు నష్ట పరిహారం అందేలా నమోదు ప్రక్రియ జరగాలని రేపల్లె వ్యవసాయ శాఖ విస్తరణాధికారి అక్తర్ హుస్సేన్ ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓదెల మీద ఉన్న వరి పొలాల్లోని నీటిని బయటకు తరలించి కట్టలుగా కట్టాలన్నారు. మొలక రాకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు నీటి ద్రావణాన్ని పిచికారి చేయాలని ఆయన చెప్పారు. మండలంలో 600 మంది రైతాంగం 7650 ఎకరాలలో వరి పంటను నష్ట పోయారన్నారు. బుధవారం ప్రారంభించిన పంట నమోదు ప్రక్రియలో 975 ఎకరాల్లో పంట నష్టం నమోదు చేయడం జరిగిందన్నారు. ఎఓ జి. మీరయ్య మాట్లాడుతూ పంట నష్టం నమోదులో ఎటువంటి అపోహలకు తావులేదని నష్టపోయిన రైతులందరికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఆధార్ కార్డు, పొలం పాసుబుక్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, కాపీలతో పాటు ఫోన్ నెంబరులను వ్యవసాయ సిబ్బందికి అందించి సహకరించాలని మీరయ్య కోరారు.

ప్రదీప్ సేవలు ఎనలేనివి

విశాలాంధ, పిడుగురాళ్ల: ఎస్‌విఎన్ గ్రూప్స్ కంపెనీస్ చైర్మన్ ప్రదీప్ సేవలు ఎనలేనివని సౌజన్య హాస్పటల్ వైద్యులు డాక్టర్ శ్రీధర్ అన్నారు. జానపాడులోని కంపెనీ డైరెక్టర్ టి. వెంకట్రావు గృహంలో బుధవారం పిడుగురాళ్ల, దాచేపల్లి, కారంపూడి మండలాలకు చెందిన సుమారు 1500 మంది పాస్టర్లు, పేదలకు రూ.ఐదు లక్షల విలువైన వస్త్రాలను పంపిణీ చేశారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రతిఏటా క్రిస్మస్, న్యూయర్, సంక్రాంతి, పండుగను పురస్కరించుకొని ఇటువంటి సేవా కార్యక్రమాలను ప్రదీప్ నిర్వహిస్తున్నారు.కంపెనీ డైరెక్టర్ కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ వలి, భాషా తదితరులు పాల్గొన్నారు.

ఆశా ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలో ఆశా ఉద్యోగాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సతీష్ అన్నారు. పీహెచ్‌సీలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓబులేశు నిపల్లెలో ఒకటి, అడిగొప్పలలో ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. వివాహమై, కనీస అర్హత ఎనిమిదవ తరగతి చదివి ఉండాలని, 25 పైన 45 లోపు వయస్సు కలిగిన అన్నీ వర్గాలకు చెందిన వారూ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 19 నాటికి ఆధార్, రేషన్, విద్యార్హత, కుల ధృవీకరణ నకలూ, ఫోటోలతో పూర్తి చేసిన దరఖాస్తును ప్రాథమిక వైద్యశాలలో అందజేయాలఅన్నారు. 20న దరఖాస్తులు పరిశీలన, ఎంపిక, 21న అభ్యర్థిపేరు ప్రకటిస్తామన్నారు.

మానసిక ఒత్తిడికి దూరంగా ఉండండి



విశాలాంధ్ర-గుంటూరు : ఆధునిక కాలంలో ప్రతిఒక్కరికి మానసిక ఒత్తిడి పెరిగిపోతుందని, సరైన విశ్రాంతి లేకపోవ్వటం వలన మానసిక ఇబ్బందులు ఎదుర్కోనాల్సి వస్తుందని వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ తెలిపారు. స్థానిక కొత్తపేట డాక్టర్ కంతా జగదీష్(సైకియాట్రిస్ట్) ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సంజీవని మానసిక వైద్యశాల ఓపీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మ చరణ్ మాట్లాడుతూ , నిత్యం ఆనందకరమైన వాతావరణంలో జీవనం సాగించాలని, పిల్లలపైన అధిక ఒత్తిడిని తీసుకురాకుడదని సూచించారు. డాక్టర్ జగదీష్ మాట్లాడుతూ, రామచంద్రపాలెంలో సంజీవని మానసిక వైద్యశాల 50 పడకలతో డి ఎడిక్షన్, రిహబిలిటేషన్ సెంటర్‌తో పాటు చిన్న పిల్లలకు ప్రత్యేకంగా మానసిక సెంటర్‌ను ఏర్పాటు చేసామని తెలిపారు. డాక్టర్ లక్ష్మణ్(న్యూరో), వేద సీడ్స్ డీజీఎం నీలం శివరామకృష్ణ, గాజుల సాయిరాం, పుల్లగుర చంద్రశేఖర్, కదరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్ సుమన్‌కు పీహెచ్‌డీ

విశాలాంధ్ర-గుంటూరు : విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ విభాగంకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ మాచవరపు సుమన్‌కు కాకినాడలోని జేఎన్‌టీయూ పీహెచ్‌డీ పట్టా అందజేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్ర కుమార్ బుధవారం తెలిపారు. 'కంబైన్డ్ ఆపరేషన్ ఆఫ్ పవర్ సిస్టమ్ స్టెబిలైజర్ అండ్ స్టాటిక్ వార్ కంపేన్సేటర్ ఆన్ మల్టీ మెషీన్ పవర్ సిస్టమ్ యూజింగ్ హ్యూరియాస్టిక్ మెథడ్స్' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారని తెలియజేసారు. ఒంగోలులోని క్యూఐఎస్ సెట్‌లోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ ఎం.వేణుగోపాలరావు గైడ్‌గాను, ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని ఈఈఈ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ పీవీ రమణారావు కో-గైడ్‌గాను వ్యవహరించారని పేర్కొన్నారు. తన పరిశోధనలో భాగంగా మొత్తం 6 పేపర్లు ప్రముఖ ఇంటర్నేషనల్ జర్నల్స్‌లో ప్రచురించారని వెల్లడించారు. సుమన్‌ను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు అభినందించారు.

కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కష్టాల్లో ఉన్న వారిని ఆదుకోవడమే మానవత్వమని గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి అన్నారు. జీజీహెచ్‌లో పేషంట్‌కు మానవతా సేవ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రూ.10వేలు నగదును ఆమె అందచేశారు. సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, అధ్యక్షులు నల్లమోతు రామరావు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల ధర్నా

విశాలాంధ్ర-వెల్దుర్తి : తెలుగుదేశం పార్టీకి చెందిన పోగంటి ఏసోబు, మాచర్ల వెంకయ్యలను ఎస్ఐ శ్రీహరి అదుపులోకి తీసుకోవడంతో తెలుగుదేశం పార్టీ మాచర్ల ఇంచార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి తమ అనుచరులతో ధర్నాకు దిగారు. విషయానికొస్తే తమ కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించి వారిని తీవ్రంగా కొట్టినట్లు బ్రహ్మారెడ్డి ఎస్ఐతో వాగ్వాదానికి దిగారు. తమ కార్యకర్తలపై చీటికిమాటికి ఎటువంటి కారణాలు లేకుండా అక్రమ అరెస్టులు చేయడం తగదని బ్రహ్మారెడ్డి ఎస్సైతో వాదించారు. దీనికి సమాధానంగా ఎస్ఐ శ్రీహరి నిందితులు ద్విచక్ర వాహనాలను సైలెన్సర్లు తొలగించి పోలీస్ స్టేషన్ ముందుగా పలుమార్లు తిరుగుతూ కేకలు అరుపులతో సంచరించారని అందువల్ల తాను వారిని అదుపులోకి తీసుకున్నామని సమాధానం ఇచ్చారు. ఈ పరిస్థితులలో పోలీస్ స్టేషన్ ఎదుట ఒకింత ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. తమ కార్యకర్తలను విడిచిపెట్టకపోతే ఇక్కడి నుంచి కదిలేది లేదని కూర్చోవడంతో జరిగిన సంఘటనను ఎస్ఐ శ్రీహరి మాచర్ల రూరల్ సీఐ షమీవుల్లాకు తెలియజేయడంతో సీఐ తమ సిబ్బందితో హుటాహుటిన వెల్దుర్తికి వచ్చారు. సీఐ షమీవుల్లా బ్రహ్మారెడ్డితో ఇక్కడ ఉన్న తమ కార్యకర్తలు అందరిని వెంటనే తీసుకెళ్లాలని కోరారు. తమ కార్యకర్తలు చేసిన నేరం ఏమిటని బ్రహ్మారెడ్డి సీఐని ప్రశ్నించగా వారిని అదుపులోకి తీసుకున్న పరిస్థితిని బ్రహ్మారెడ్డికి వివరించి పరిస్థితిని చక్కదిద్దారు. విలేకరుల సమావేశంలో సీఐ షమీవుల్లా మాట్లాడుతూ ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న పోగంటి ఏసోబు మద్యం సేవించి ఉండడంతో అతనిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసును, మాచర్ల వెంకయ్యపై న్యూసెన్స్ కేసును, విధులకు ఆటంకం కల్పించిన తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మారెడ్డి అతని అనుచరులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీహరితో పాటు మాచర్ల టౌన్ ఎస్ఐ, రూరల్ ఎస్సైలు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

విశాలాంధ్ర-తాడికొండ : మండలంలో కేటాయించిన జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ భాస్కర్ నాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయ ఆవరణలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాలలో ఇళ్ల నిర్మాణ పనులు ఏ మేరకు పూర్తయ్యాయి అనే వివరాలను సంబంధిత అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. లాం గ్రామంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సుధాకర్, ఇన్‌చార్జ్ ఎండీఓ బిక్కీ మహేష్ బాబు, హౌసింగ్ ఏఈ ఓబుల్ రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో ఎస్‌జీకే విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ ఎస్‌జీకే గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల అథ్లెటిక్ పోటీలు ఈ నెల 10వ తేది నుంచి 12 వరకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గుంటూరులో జరిగినవి. ఇందులో డాక్టర్ ఎ.కృష్ణవేణి ఫిజికల్ డైరెక్టర్ పర్యవేక్షణలో శ్రీమతి గంగినేని కళ్యాణి ప్రభుత్వ కళాశాల వినుకొండ విద్యార్థులు పతకాలు సాధించారు. ఎన్.రమ్య, సెకండ్ బికాం హై జంప్ విభాగంలో బంగారు పతకాన్ని సాధించారు. పి.ప్రభుతేజ, ఫస్ట్ బీఏ జావలిన్ త్రో విభాగంలో కాంస్య పతకాన్ని సాధించారు. జి.జనార్ధన్ రెడ్డి, ఫస్ట్ బీఏ కాంస్య పతకాన్ని సాధించారు.

పంటనష్టం అంచనా వేయండి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మాండస్ తుపానుతో దిక్కుతోచని స్థితిలోపడిన అన్నదాతను ఆదుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు ఇ.చంద్రయ్య అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో 'రైతులకు తరగని కష్టాలను మిగిల్చిన తుఫాన్'అనే అనే అంశంపై చర్చా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తుల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. చేతికొచ్చిన పంటలు నీట మునిగి రైతులు కన్నీరు, మున్నీరు అవుతున్నారని, ఆరుగాలం శ్రమించి అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు చేతికి వస్తాయనుకున్న సమయంలో మాండస్ తుఫాను విరుచుకుపడి పంటలు నీటిపాలు కావటంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు నాయకులు శ్రీనివాసరావు మాట్లాడుతూ రేపో మాపో మార్కెట్‌కు చేరాల్సిన ధాన్యపు కల్లాల్లోకి వర్షపు నీరు చేరి రైతులకు తరగని నష్టాన్ని మిగిల్చిందన్నారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ అన్ని విధాలా నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. శ్రీరామమూర్తి, వెంకటరత్నం, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : కురిసిన వర్షాల నుంచి శనగ పంటను కాపాడుకోవటానికి తగిన సస్యరక్షణ పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. మండలంలోని గొట్టిపాడు గ్రామంలోని శనగ పంట పొలాలను ఏరువాక కేంద్రం ప్రిన్సిపాల్ సైంటిస్ట్, కో ఆర్డనేటర్ జి.కిషోర్ బాబు, సీనియర్ సైంటిస్ట్ సీహెచ్ శ్రీలత వాణి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివ కుమారి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటకు చీడపీడలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాల వలన నీరు నిలబడిన పొలాలలో నీటిని బయటికి పంపాలని, తర్వాత ఒక ఎకరాకు 19.19.19, ముల్టి కె ఒక కేజీను పిచికారి చేయాలని సూచించారు. ప్రస్తుతం రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా ఉండి, మంచు పడటం వలన శనగలో కుంకుమ, తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉంది. హెక్సోకనజోన్ 400 మిల్లీలీటర్లు పిచికారి చేయాలని సూచించారు.ఏవో టి.శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, వీఏవోలు, రైతులు పాల్గొన్నారు.

'నల్ల తామర' నివారణపై అవగాహన

విశాలాంధ్ర-మేడికొండూరు : మండలంలోని పాలడు గ్రామ సమీపంలో బుధవారం పెస్టిసైడ్స్ ఇండియా, సౌత్ ఏషియా బయోటెక్నాలజీ సెంటర్ సంయుక్తంగా మిరప రైతులు ఎదుర్కొంటున్న నల్ల తామర పురుగు నివారణ, సశ్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నల్ల తామర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణలో భాగంగా జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వేప ఆధారిత మందుల పిచికారి వల్ల తామర పురుగు ఉధృతి తగ్గుతుందని తెలియజేశారు. జీవ నియంత్రణ పద్ధతులు అవలంబిస్తూ మందులను పిచికారి చేయాలని తెలిపారు. మొక్కలకు సూక్ష్మ పోషకాలు అందించడం ద్వారా తామర పురుగుల ఉధృతి తట్టుకొని అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్ ద్వారా మందుల పిచికారి చేశారు. సౌత్ ఏషియా బయోటెక్నాలజీ సెంటర్ శాస్త్రవేత్త భగీరథ చౌదరి, డాక్టర్ టి.రవీంద్ర, డాక్టర్ అమర్, మురళీకృష్ణ, తమిళనాడు వ్యవసాయ కళాశాల విరామ శాస్త్రవేత్త డాక్టర్ బాలసుబ్రమణ్యం, డాక్టర్ అప్పలరాజు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ఎస్టీయూ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-గుంటూరు : కాకుమాను మండల పరిధిలోని పెద్దివారిపాలెం గ్రామానికి చెందిన వల్లూరి మోషే, బుల్లెమ్మాయి దంపతుల కుమారుడు వల్లూరి సుధాకర్ మానసిక వైకల్యంతో గత 32 సంవత్సరాలుగా బాధపడుతున్నాడు. నిరుపేదలైన తల్లిదండ్రులకు ఆసరాగా వల్లూరి సుధాకర్ వైద్య ఖర్చుల నిమిత్తం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం కాకుమాను మండల శాఖ రూ.10 వేలను వారి కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. ఎస్టీయూ గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు, కాకుమాను మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జొన్నకూటి సుబ్బారావు, కాంద్రు సద్గుణ రావు, జిల్లా కార్యదర్శి మద్దిరాల వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు లంకపల్లి వీరాంజనేయులు, నాయకులు పొందుగల రవికుమార్, జె.పీటర్ పాల్, నాగమణిమ్మ, మంచాల చలపతిరావు తదితరుల ఆర్థిక సహాయంతో నగదును గేరా మోహనరావు, జొన్నకూటి సుబ్బారావు, లంకపల్లి వీరాంజనేయులు చేతుల మీదుగా సుధాకర్‌కు అందజేశారు.

పౌష్టికాహార కిట్‌లు సక్రమంగా పంపిణీ చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: గర్భిణీలు, బాలింతకు, చిన్నారులకు పౌష్టికాహారం కిట్‌లను అంగన్ వాడీ కార్యకర్తలు, ఆయాలు సక్రమంగా పంపిణీ చేసేలా అధికారులు బాధ్యతగా పర్యవేక్షించాలని రాష్ట్ర మహిళా, శిశు, విభిన్న ప్రతిభావంతులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ మంత్రి కె వి ఉషా శ్రీచరణ్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశం మందిరంలో ఒంగోల్ జోనల్ పరిధిలోని జిల్లాల మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీలు, సీడీపీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒంగోలు జోన్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు శైలజ జోనల్ పరిధిలోని మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో అమలు జరుగుతున్న కార్యక్రమాలను, ఇతర అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. సమీక్షలో మంత్రి ఉషా శ్రీచరణ్ జిల్లాల వారీగా వైఎస్ఆర్ జగనన్న సంపూర్ణ పోషణ, పోషణ ప్లస్, బాలామృతం కిట్‌లు, కోడిగ్రుడ్లు, పాల ప్యాకెట్ల కిట్ సరఫరా, వాటి వినియోగం, ఇతర అంశాలపై పీడీలు, సీడీపీవోలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.నాణ్యత లేని సరుకుల సరఫరా చేస్తున్న ఏజెన్సీలకు బిల్లులు నిలుపుదల చేసి వివరణ కోరుతూ నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం మహిళా ప్రాంగణంలో నూతనం నిర్మించిన వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ ను మంత్రి పరిశీలించారు. మనోరంజని, అరుణ, ధనలక్ష్మీ, ఉమా, సౌజన్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

విశాలాంధ్ర-మాచర్ల : పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని పట్టణ సీఐ టి.బాలకృష్ణ హెచ్చరించారు. బుధవారం టౌన్ సర్కిల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఆటోలు నడిపితే సహించేది లేదన్నారు. ఆటో డ్రైవర్లు ప్రతిఒక్కరికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి అన్నారు. పరిమితికి మించి వాహనాలలో ప్రయాణీకులను ఎక్కిస్తే కేసులు తప్పవన్నారు. మైనర్‌లు వాహనాలు నడుపుతున్నారని సమాచారముందని మరోసారి పోలీసుల కంటపడితే వారి తల్లిదండ్రులపై కేసుల నమోదుకు వెనుకాడొద్దన్నారు.

ఆన్‌లైన్ శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-తెనాలి : హార్వెస్ట్ ఇండియా సౌజన్యంతో ఆంధ్రప్రదేశ్ ఎస్ఐ, కానిస్టేబుల్ వ్రాత పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణా తరగతులు ఇవ్వబడునని జయదేవ్ అకాడమీ డైరెక్టర్ పి.అపర్ణ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బోసురోడ్డులోని జయదేవ్ అకాడమీ కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అభ్యర్థులకు జయదేవ్ అకాడమీ ద్వారా బుధవారం 16వ తేది వరకు జయదేవ్ అకాడమీ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోని ఉచిత ఆన్‌లైన్ తరగతులు పొందవచ్చని, ఉచిత ఆన్‌లైన్ శిక్షణా తరగతులు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ అపర్ణ కోరారు.

అన్నదాతను

ప్రభుత్వమే ఆదుకోవాలి

విశాలాంధ్ర-నూజెండ్ల : మాండస్ తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వమే నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. మండలంలోని చాలా గ్రామాలలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న పంటలను సీపీఐ నూజెండ్ల మండల కార్యదర్శి అప్పరాజు పవన్ కుమార్‌తో కలిసి దెబ్బతిన్న పత్తి, మిర్చి, కంది, పొగాకు, వరి పొలాలను బుధవారం పరిశీలించారు. రాము మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారని, గత ఏడాది మిర్చి పంటకు బొబ్బర తామర తెగులు వచ్చి మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని వినుకొండ నియోజకవర్గంలో ఐదుగురు రైతులు తెచ్చిన అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఈ ఏడాది పల్నాడు జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు వల్ల మాచర్ల, గురజాల, పెద్దకూరపాడు నియోజకవర్గాల్లో వేలాది మంది రైతులు నకిలీ విత్తనాల బారినపడి పంట నష్టపోవడం జరిగిందన్నారు. నకిలీల కేటుగాళ్ల నుంచి రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపోయిన మిర్చి రైతులకు ఎకరాకు రూ.70 వేలు, పత్తి రైతులకు ఎకరాకు రూ.50 వేలు పొగాకు రైతులకు ఎకరాకు రూ.50 వేలు అపరాలకు ఎకరాకు రూ.40 వేలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తడసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు సంపత్ పిచ్చయ్య, దూదేకుల కాసిం, చక్రి, వీరారెడ్డి, బత్తుల వెంకయ్య, గుమ్మ గురవయ్య, దూదేకుల నబి, కామసాని వెంకటేశ్వర్లు, గాలం వీరయ్య, దుపాటి రాజా, నర్రా పోలయ్య, కోటేశ్వరరావు, ముని తదితరులు పాల్గొన్నారు.

రైతును నిండాముంచిన 'మాండస్'

-జిల్లాలో 65 వేల ఎకరాలు నీటిలోనే

- ప్రభుత్వ సాయానికై ఎదురుచూపు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : అన్నదాతలను మాండస్ తుఫాన్ ముంచేసింది. ఆరుగాలం చెమటోడ్చి సాగు చేసిన కర్షకులపై పకృతి కన్నెర్ర చేయటంతో చెమర్చిన కళ్లతో నీట మునిగిన పంటను చూసుకుంటూ దినదినం ఆవేదన చెందుతున్నారు. పంట చేతికి వచ్చింది అనుకుంటున్న తరుణంలో తుపాను ఆశలు అడియాశలు చేసింది. వరికోతలు కోసే సమయానికి కర్షకులను అతలాకుతలం చేసి అప్పుల ఊబిలోకి నెట్టింది.

కృష్ణ పశ్చిమ,డెల్టా ఎన్నెస్పీ ఆయకట్టు కింద జిల్లాలో ఖరీఫ్ 3.24 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. మాండౌస్ తుఫాను దాటికి జిల్లా వ్యాప్తంగా 65 వేల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయాధికారుల గణాంకాలు చెపుతున్నాయి. బాపట్ల, రేపల్లే,వేమూరు నియోజకవర్గాల్లో 22 వేల ఎకరాల్లో వరి ఓదెలు నీట మునిగాయి. 40 వేల ఎకరాల్లో కోత దశలో ఉన్న వరి పైరు నేలవాలి నీట మునిగింది. వరి ఓదెలు నీటిలో మునగటం వల్ల వరి కుంకులు మొలకలు వచ్చాయి. మరోవైపు గింజలు రంగు మారటంతో కొనుగోలు చేయరని రైతులు ఆవేవన వ్యక్తం చేస్తున్నారు.

జె.పంగులూరు, కొరిశపాడు, అద్దంకి మండలాల్లో వంద ఎకరాల్లో అపరాలు, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. డెల్టాలో రబీలో విత్తనాలు నాటగా అపరాలు, మొక్కజొన్న వర్షానికి దెబ్బతిన్నాయి. వందల ఎకరాల్లో కూరగాయలు, పచ్చిమిర్చి తోటలు పూత రాలిపోయింది. తుపాను కారణంగా వరి కోయకుండా ఉండటం వల్ల కంకులు రాలిపోయి దిగుబడులు తగ్గుతాయని రైతులు భయపడుతున్నారు. చీరాల పర్చూరు నియోజకవర్గాల్లో వరి ఈనే దశలో ఉన్న వరికి తాలు కంకులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం అవుతుంది. గతేడాది భారీ వర్షాలు వల్ల లక్ష ఎకరాల్లో పంట నష్టం జరిగింది.

పంట నష్టం అంచనావేయండి: సీపీఐ

తుపాను ప్రభావానికి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తన్నీరు సింగరకొండ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జేబీ శ్రీధర్, రైతుకూలీ సంఘం నాయకులు నాగిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కర్లపాలెం మండలంలోని గణపవరం పంచాయతీ చినపులుగువారి పాలెంలో బుధవారం నీట మునిగిన వరిపైర్లను పరిశీలించారు. వరి పైరు పూర్తిగా నీటిలోనే ఉందని కంకులు నాని మొలకలు వస్తున్నాయని అన్నారు. వ్యవసాయాధికారులు కూడా కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడలేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనా వేసి రైతులకు పరిహారం అందించాలి కోరారు.

ప్రజాసాహిత్యకారుడు 'రాచమల్లు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ప్రజా సాహిత్యకారుడు, అభ్యుదయ సాహితీవేత్త రాచమల్లు రామచంద్రారెడ్డి (రారా)అని అరసం జాతీయ కార్యదర్శి పెనుగొండ లక్ష్మీనారాయణ కొనియాడారు. స్థానిక లాడ్జిసెంటర్‌లోని ఏఎల్ బీఈడీ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గుంటూరు విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాలలో భాగంగా బుధవారం అభ్యుదయ సాహితీవేత్త ముత్యాల ప్రసాద్ సాహితీ వేదికపై 'ప్రసిద్ధ అభ్యుదయ సాహితీవేత్త రాచమల్లు శత జయంతి సభ జరిగింది. ఈ సందర్భంగాలక్ష్మీనారాయణ మాట్లాడుతూ 3దశాబ్దాల పాటు శాస్త్రీయంగా ఆలోచించడం కోసం రారా రచనలు రాశారన్నారు. ఆయన కథల్లో ఆర్థికాంశం ప్రధాన ఇతివృత్తంగా ఎంతో పకడ్బందీగా కనిపిస్తాయన్నారు. రచనల్లో చారిత్రక దృక్పథం కనిపిస్తుందని, విమర్శకుడిగా రారా సాహిత్య విమర్శలో మార్క్సిస్టు ప్రమాణాలను స్థాపించారని అన్నారు. అభ్యుదయ సాహిత్యంలో కవిత్వానికి శ్రీశ్రీ వచనానికి కొడవటిగంటి విమర్శకు రారా సదా నిర్దేశకులు అని ప్రశంసించారు. రారా సంపాదకత్వంలో వెలువడిన సంవేదన పత్రిక తెలుగు విమర్శనా ప్రక్రియలో ప్రామాణికమైందని కొనియాడారు. మాస్కోలో అనువాదకునిగా ఎన్నో విలువైన గ్రంథాలను తెలుగువారికి అందించిన గొప్ప అనువాదకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి అని, విద్యార్థిగానే 1941లో గిండి ఇంజనీరింగ్ కాలేజీలో గాంధీ నిరసనోద్యమానికి సంఘీభావం తెలిపిన సందర్భంలో రారా, చంద్ర పుల్లారెడ్డిలను కళాశాల నుంచి బహిష్కరించారని వివరించారు.

ఏఐటీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ, అరసం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఓబులేసు మాట్లాడుతూ కడప నుంచి వెలువడిన సవ్యసాచి పత్రిక సంపాదకునిగా, కమ్యూనిస్టు ఉద్యమ వ్యాప్తికి ఎంతగానో దోహదపడింది రారా అని, తెలుగు నాట ఇప్పటికీ విమర్శకుడిగా ప్రత్యేకత కలిగిన విమర్శకుడు రాచమల్లు రామచంద్రారెడ్డి అని వివరించారు. రారా తనకు మార్గదర్శకుడు అని పేర్కొన్నారు. అరసం జిల్లా కార్యవర్గ సభ్యులు, యువ న్యాయవాది బుల్లా రవిబాబు వక్తలను వేదికపైకి ఆహ్వానించారు. గుంటూరు విశాలాంధ్ర బుక్‌హౌస్ మేనేజర్ ఎం.మల్లిఖార్జునరావు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు : పుస్తక మహోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం ఆరున్నర గంటలకు ప్రముఖ సాహితీవేత్త కందిమళ్ల శివప్రసాద్ అధ్యక్షతన అరసం ప్రచురణ ఈతరం కోసం-కథాస్రవంతి'పరిచయ సభ జరుగుతుంది. విశ్రాంత ఉద్యోగి కొప్పర్తి రాంబాబు మాట్లాడనున్నారు.

స్టార్టప్ ఇండియా వృద్ధికి మీ ప్రణాళిక ఏమిటి?

పార్లమెంట్‌లో ఎంపీ గల్లా జయదేవ్



విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్టార్టప్ ఇండియా లక్ష్యం ఉత్పత్తులు, సేవల అభివృద్ధి, ఆవిష్కరణ, భారతదేశంలో ఉపాధి రేటును పెంచడంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మధ్య ప్రణాళికను ఎలా సిద్ధం చేస్తున్నారని బుధవారం పార్లమెంట్‌లో గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్ ప్రశ్నించారు. స్టార్టప్ ఇండియా పథకం అనేది ఉపాధి కల్పన, సంపద సృష్టి కోసం భారత ప్రభుత్వం చొరవ. ఇది దేశంలో ఇన్నోవేషన్, స్టార్టప్‌లను పెంపొందించడానికి బలమైన పర్యావరణ వ్యవస్థను నిర్మించడానికి ఉద్దేశించబడిందని, స్థిరమైన ఆర్థిక వృద్ధిని, పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందన్నారు. స్టార్టప్‌లలో భారతదేశం ప్రపంచంలో 3వ స్థానంలో ఉంది. 2016లో కేవలం 450 స్టార్టప్‌లు ఉంటే ఇప్పుడు 84,000కు పెరిగిందని ప్రభుత్వం చెపుతుందని, కానీ స్టార్టప్‌లో 90శాతం విఫలమవుతాయి. కొత్తగా ఆవిష్కరణ లేకపోవడం, నిధుల కొరత, దృష్టి, వ్యాపార నమూనా వైఫల్యం వంటి సవాళ్లు ఉన్నాయి. సంవత్సరంలో 10శాతం విఫలమవుతాయి. స్టార్టప్‌లలో వైఫల్యాన్ని అధిగమించడాన్ని చూస్తుంటే, ఇంక్యుబేటర్లు వివిధ సమస్యలను పరిష్కరించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అన్నారు. ఇంక్యుబేషన్ ప్రక్రియలో భాగంగా తీసుకోవలసిన చర్య సరైన స్థాయిలో లేదని మనం భావించవచ్చా అని ప్రశ్నించారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల మధ్య మెరుగైన స్టార్టప్ ఇంక్యుబేటర్ సహకార కార్యక్రమానికి ప్రణాళికను ఎలా సిద్ధం చేస్తున్నారని ప్రశ్నించారు.

గర్భిణీల ఆరోగ్య పరిస్థితులను గుర్తించాలి



విశాలాంధ్ర-ఫిరంగిపురం: ప్రభుత్వ సూచనల మేరకు మండలంలో వివిధ పాఠశాలల్లో , అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో చదువుకుంటున్న బాల బాలికలు మరియు గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితులను వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు మరియు సిబ్బంది సమన్వయంతో సక్రమంగా గుర్తించి పౌష్టికాహారం, మందులు అందించి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఉమెన్స్ ఎన్డ్ చైల్డ్ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ సిరి అధికారులకు సూచించారు. ప్రభుత్వ సూచనల మేరకు తనిఖీల్లో భాగంగా బుధవారం ఫిరంగిపురం మండల కేంద్రంలో 3వ సచివాలయాన్ని అకస్మికంగా సందర్శించి సచివాలయ పరిధిలో ఉన్న బాలికలు, గర్భిణీలకు ప్రతి రోజు అందించే పౌష్టికాహారం, మందుల వివరాలును అధికారులను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను తనిఖీలు చేసి నిత్యం బాలలికలు, గర్భిణీలకు సంబంధించిన వివరాలును ఎంపిక చేసి రికార్డుల్లో పొందుపర్చాలని చెప్పారు. బాలికలు, మహిళల్లో రక్త హీనత, ఐదు సంవత్సరాల్లోపు పిల్లలు ఎత్తు, బరువు తక్కువగా ఉండటం, బడి మానేసిన పిల్లలు, పాఠశాల్లో పరిశుభ్రత, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు జిల్లాలో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నపిల్లలందరు వైయస్సార్ సంపూర్ణ పోషణ తీసుకొనేలా మహిళా శిశు సంక్షేమ శాఖాధికారులు నిరంతరం పర్యేక్షించాలన్నారు.

కేరళ సామాజిక తత్వవేత్త

నారాయణగురు జీవితం ఆదర్శం

విశాలాంధ్ర- నాగార్జున యూనివర్సిటీ: కేరళ సామాజిక తత్వవేత్త నారాయణ గురు జీవితం అందరికీ ఆదర్శనీయమని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజశేఖర్ పట్టేటి పేర్కొన్నారు. వైస్ ఛాన్సలర్ ఛాంబర్ లో బుధవారం డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ - జాషువా - పూలే - పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ ముద్రించిన నారాయణ గురు పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ నారాయణ గురు కుల అసమానతలపై రాజీలేని పోరాటం చేశారని తెలిపారు. భారతీయ సామాజిక తత్వవేత్తల రచనలు మరిన్ని ముద్రించాలని ఆకాంక్షించారు. విద్యార్థి, యువజన, మేధావులు అంశం పై దృష్టి సాధించాలని కోరారు. ఫౌండేషన్ అధ్యక్షులు బి.విల్సన్, ఉపాధ్యక్షులు కడియం జేమ్స్, ప్రధాన కార్యదర్శి బి.శ్యాంబాబు, డీ న్ సి.డి.సి. ఆచార్య మధుబాబు, డీన్ ఆచార్య చెన్నారెడ్డి పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగన్

విశాలాంధ్ర - పిట్టలవాని పాలెం : రైతుపక్షపాతి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని మండల ఎంపీపీ షేక్ బాజీ, రాష్ట్ర రహదారుల డైరెక్టర్ షేక్ హుస్సేన్ అన్నారు.మాండూస్ తుఫానుతో దెబ్బతిన్న వరి పొలాలను బుధవారం మండలంలోని చందోలులో వ్యవసాయ అధికారులతో కలిసి వారు పరిశీలించి మాట్లాడారు.మాండూస్ తుఫానుతో రైతులు చాలా వరకు పంట దెబ్బ తిన్నారని ఇలా జరగడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు.పంట దెబ్బ తిన్న ప్రతి రైతుకు ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.పంట నష్ట పరిహారం అందించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయ అధికారులు రైతుల వివరాలను నమోదు చేస్తున్నారని చెప్పారు.పంట దెబ్బతిన్న వరి ధాన్యం రంగు మారిన కూడా ప్రభుత్వం ఆర్బికేల ద్వారా కొనుగోలు చేస్తుందని రైతుల ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

ఆప్టో ఎలక్ట్రానిక్స్ శాస్త్రవేత్త

డాక్టర్ చెన్నుపాటి 17న కేఎల్‌యూకు రాక

విశాలాంధ్ర-తాడేపల్లి : విదేశంలో చేసిన పరిశోధనలకు ఎంతో గుర్తింపు పొంది సూక్ష్మ ఎలక్ట్రానిక్ పరికరాలను తయారు చేసే మెషీన్‌లను, నీటి నుంచి హైడ్రోజన్ అణువులను వేరు చేసే నానో ప్రక్రియను కనిపెట్టిన తెలుగు ఆణిముత్యం ప్రముఖ శాస్త్రవేత్త, ఆస్ట్రేలియా పరిశోధనా కేంద్రానికి చెందిన ప్రముఖ పరిశోధకులు డాక్టర్ చెన్నుపాటి జగదీష్, ఆప్టో ఎలక్ట్రానిక్స్ ఉపయోగాలపై విస్తృత స్థాయిలో చర్చించడం కోసం కేఎల్‌యూలో ఈనెల 17న అంతర్జాతీయ వర్క్‌షాపులో పాల్గొంటారని భౌతికశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ కె.స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా వల్లూరుపాలెంకు చెందిన డాక్టర్ చెన్నుపాటి జగదీష్, ఆస్ట్రేలియాలోని జాతీయ విశ్వవిద్యాలయం క్యాన్ బెర్రాలో పరిశోధకులుగా స్థిరపడ్డారు. అత్యాధునిక మొబైల్ ఫోన్‌లలో ఉపయోగించే పోల్డబుల్ ఎల్‌ఈడీ లైట్లు, గ్రాములో వెయ్యో వంతు మాత్రమే బరువుండే సోలార్ సెల్‌లు, మనిషి కేవలం నీడలా కాకుండా త్రీడి బొమ్మలా కనిపించే హోలో గ్రామ్‌లు వంటి అనేక ఎలక్ట్రానిక్ పరికరాలను తన పరిశోధనల ద్వారా కనిపెట్టిన తెలుగు పరిశోధకులు డాక్టర్ జగదీష్ ఆస్ట్రేలియాలో సైతం తన పరిశోధనలకు ఎన్నో అవార్డులు రివార్డులు అందుకోవడమే కాకుండా అత్యున్నత పురుస్కారమైన కంపానియన్ ఆఫ్ ఆర్డర్‌ని పొందారు.

కార్మికులకు ప్రభుత్వం అండ: అంబటి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మెకానిక్‌లు ఎంతో కష్టజీవులని, వారు ఏర్పాటు చేసుకున్న యూనియన్‌కి ఎల్లప్పుడు అండగా ఉంటానని జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఆటో కార్ మెకానిక్ యూనియన్ ప్రథమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా బుధవారం హాజరయ్యారు. అంబటి మాట్లాడుతూ మెకానిక్‌లకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ నెల 21న సీఎం జగన్ జన్మదినం సందర్భంగా మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశామని యువకులు రక్తదానంచేసి ప్రాణదాతలుగా ఉండాలన్నారు. ప్రముఖ వైద్యులు శ్రీధర్ మాట్లాడుతూ, వాహనాల కండిషన్‌కు ప్రాధాన్యతనివ్వాలన్నారు. పిడుగురాళ్ల మోటార్ వెహికల్ అధికారి రాంబాబు, మునిసిపల్ వైస్ చైర్మన్ నాగుల్ మీరన్, యువ నాయకులు అచ్యుత శివప్రసాద్, యూనియన్ అధ్యక్షులు మస్తాన్ వలి, కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, గౌస్, ముస్తఫా, ఘన్ సైదా, షకూర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ ఏర్పాటుకు ప్రణాళికలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : గవర్నమెంట్ హాస్పటల్‌లో నూతన డ్రైనేజి వ్యవస్థ ఏర్పాటుకు తగిన ప్రణాళికలను సిద్ధంచేయాలని అభివృద్ధి కమిటీకి మంత్రి అంబటి రాంబాబు సూచించారు. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హాస్పటల్లో డ్రైనేజ్ సిస్టమ్ పూర్తిగా మార్చాలని, అవసరమైన చోట కొత్త లైన్లు వేయాలని, దానికి సంబంధించి ఏపీఎంఎస్ఐడి వాళ్లతో మాట్లాడి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.కొత్తగా ఫ్యామిలీ మెడిసిన్ సీట్ కోసం దరఖాస్తు చేసామని దానికోసం అమౌంట్ విడుదల చేయాలని నిర్ణయించారు. ఆక్సిజన్ ప్లాంట్‌కు సంబంధించి రిపేరు, సర్వీస్‌కి అమౌంట్‌ని ఆమోదించారు. ఆపరేషన్ థియేటర్లో రిపేర్లను, కొన్ని చిన్న పరికరాలు కొనుగోలుకు ఆమోదించారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ రూ.50 లక్షల విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్, జనరేటర్ ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయని తెలియజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ వెంకట్రావు, ఆర్ఎంవో శోభారాణి, అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ గిరిజ, డాక్టర్ రాజమోహన్ రెడ్డి, సయ్యద్ కాజా, కొత్త రామకృష్ణ, ఏపీ ఎమ్మెస్ ఐడి శ్రీధర్, డిఈ భాగ్యలక్ష్మి, మెగా ఇంజనీరింగ్ ప్రతినిధులు సతీష్, నవీన్, డాక్టర్ షకీలా శ్రీధర్, డాక్టర్ హశాంతి తదితరులు పాల్గొన్నారు.

మాదిరి ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు ఉపయుక్తం

విశాలాంధ్ర - నిజాంపట్నం : యుటిఎఫ్ చే రూపొందించబడిన పదవ తరగతి మాదిరి ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని గుంటూరు జిల్లా డిసిఎంఎస్ చైర్మన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్ అన్నారు.యుటిఎఫ్ చే రూపొందించబడిన పదవ తరగతి మోడల్ ప్రశ్నాపత్రాలను యార్లగడ్డ మదన్ జన్మదిన సందర్భంగా బుధవారం మండలంలోని అడవులదీవి జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఆమె ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుటిఎఫ్ చే రూపొందించబడిన మాదిరి ప్రశ్నాపత్రాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.యుటిఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు జే.వినయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది యుటిఎఫ్ రూపొందించిన ఈ పుస్తకంలో ఆరు మాదిరి ప్రశ్న పత్రాలు ఉన్నాయని విద్యార్థులు వీటిని వినియోగించుకొని ప్రిపేర్ అవ్వాలని కోరారు. మోహన్ రావు, సిహెచ్ బాపయ్య,గణేష్ రావు పాల్గొన్నారు.

తూర్పు సత్రం రగడపై మంత్రికి 'అన్నం' లేఖ

విశాలాంధ్ర - బాపట్ల : గత కొంతకాలంగా బాపట్ల పట్టణంలో రాజకీయ రగడలకు దారితీసిన పేరం గరుడాచలం నాయుడు తూర్పుసత్రం రగడపై మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ జిల్లా ఇంచార్జీ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు లేఖ రాశారు. పేరం గారుడాచలం నాయుడు తూర్పు సత్రం భూమిపై హిందూ సమాజం, కాపు సామాజికవర్గం యొక్క మనోభావాలు పరిగణలోకి తీసుకుని సున్నితమైన అంశం జఠిలం కాకుండా భూమి లీజు వివాదం పరిష్కరించాలని లేఖలో కోరారు. జాతీయ రహదారి పని నిమిత్తం తాత్కాలిక లీజునకు సత్రం భూమి ఇచ్చినా సమస్య సున్నితత్వాన్ని అర్థం చేసుకుని నిర్మాణ సంస్థ ప్లాంట్ వేరే అనువైన ప్రదేశంనకు తరలించడం వలన గుత్తేదారు సంస్థకు ఆర్థికంగా భారమైనది కాదని లేఖలో పేర్కొన్నారు.

CHANGE OF NAME

I, GOLLAMARI SRINIVASA REDDY (Old Name) S/o. (Late) GOLAMAHI MALLA REDDY, R/o. Flat No.404, Sri Balaji Residency, 2nd Lane, NGGO Colony, Guntur - 522004, Guntur District, A.P., Have changed my name to GOLAMARI SRINIVASA REDDY. Hereafter my name is known as GOLAMARI SRINIVASA REDDY.

నోటీసు

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.260/2019, O.S NO: 291/2018

State Bank of India Macherla branch, represented by Branch Manager - వాది.

Korra Sukali Nayak (died), Korra Lakshmi Bai and two Others - ప్రతివాదులు/ రెస్పాండెంట్స్.

టు,

కేతావత్ షిఖి బాయి, భర్త నాగరాజు నాయక్, చిన్నపర్లపాయి తండా, వెల్దుర్తి మండలం. R4.

పై దావాలో ప్రతివాది మరణించినందున ప్రతివాది మనుమరాలుగా పై భావాలు మిమ్మలను చేర్చుటకు వాది ఐ.ఎ 260/2019ని దాఖలు చేసి ఉన్నాడు. పై దావా లో మిమ్మలను వారసులుగా చేర్చుటకు మీకు గల అభ్యంతరములను మీరు స్వయంగా గాని లేదా శ్రీ కోర్టు వారి అన్ని షరతులకు బదులు ఇవ్వ గల న్యాయవాది ద్వారా గాని మీరు ది.30-12-2022న ఉదయం 10-30 గంటలకు హాజరు కావలెను. లేని యెడల దావాను మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

వాయిదా ది.30-12-2022

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

గంద్రకోట శ్రీనివాసరావు

వాది తరపు న్యాయవాది, మాచర్ల.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, తాడేపల్లి శివారు, సీతానగరంలోని రాజీవ్ నగర్ కాపురస్తుడు వకీల్ అహమ్మద్ ఖాన్ గారి కుమారుడు నజాకత్ ఖాన్ నుండి సంజాయిషీ పొంది తెలియచేయునది ఏమనగా, నా క్లయింటుకు చెందిన దిగువ షెడ్యూలు దాఖలా ఖాళీ నివేశన స్థలమును ది.18-09-2006న గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, తాడేపల్లి శివారు సీతానగంలోని రాజీవ్ నగర్ కాపురస్తుడు షేక్ అబ్దుల్ లతీఫ్ గారి కుమారుడు షేక్ అల్తాఫ్ గారి నుండి క్రయం పొంది శ్రీ మంగళ గిరి సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయం యందు విక్రయ దస్తావేజు నెం: 5784/2006రుగా రిజిష్టరు పొంది యున్నాడు. సదరు ఒరిజినల్ విక్రయ దస్తావేజును జిరాక్సు తీయించుకొను నిమిత్తం తాడేపల్లి ఏరియాలోని మహానాడు యందు గల జిరాక్సు షాపుకు మోటారు బైక్పై వెళ్లుచుండగా దారి మధ్యలో సదరు డాక్యుమెంటు పెట్టుకున్న కవర్ జారీ పోయినది. సదరు డాక్యుమెంటు గల కవర్ కొరకు నా క్లయింటు ఎంత వెతికిననూ దొరకలేదు. సదరు డాక్యుమెంట్లు ఎవ్వరికైననూ దొరికిన నాకు గాని, నాక్లయింటుకు యివ్వవలసినదిగా కోరుచూ, సదరు డాక్యుమెంటుకు సంబంధించి ఏ విధమైన లావాదేవీలు జరిగినా అవి నాక్లయింటును భాధ్యుడను చేయజాలవని తెలియచేయడమైనది.

షెడ్యూలు:- గుంటూరు డి. మంగళగిరి సబ్ డి యిలాకా, తాడేపల్లి మండలం, తాడేపల్లి గ్రామ పంచాయితీ యేరియాలో చేరిన తాడేపల్లి గ్రామం తాలూకు డి. నెం: 147/1ఎ1 రు, తాడేపల్లి పంచాయితీ, 12వ బ్లాకు పాత డోరు నెం: 12-815రు, కొత్త డోరు నెం: 12-1122రు సమీపమున గల ప్లాటు నెం: 39రులోని సగ భాగము అనగా చ.గ. 53లు లేక చ. మీ. 44.31లు ఖాళీ నివేశన స్థలముకు హద్దులు:- తూర్పు: నెం. 42రు ప్లాటు దాఖలా కాలే శేషారత్నం గారి స్థలం హద్దు, దక్షిణం: రాచూరి చలమయ్య గారి ప్లాటు నెం: 40రు హద్దు, పడమర: అ. 14లు వెడల్పుగల అందరి జాయింటు రోడ్ హద్దు, ఉత్తరం: అచ్చన గోపాలకృష్ణగారి ప్లాటు నెం: 37.38 స్థలము హద్దు.

మంగళగిరి, 14-12-22

గాదంశెట్టి రామకృష్ణ, అడ్వకేట్

సెల్: 9848504078

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-యడ్లపాడు : గడ్డి మందు తాగిన 15 రోజుల తర్వాత బుధవారం తెల్లవారుజామున వ్యక్తి చనిపోయిన సంఘటన ఇది. యడ్లపాడు ఎస్సై పైడి రాంబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉన్నవ గ్రామానికి చెందిన పల్లె కోన గోపి(28) గత నెల 28వ తేదీ ఉన్నవ బోయపాలెం గ్రామాల నడుమున గల వెంచర్స్‌లో గడ్డి మందు సేవించారు. అలానే ఇంటికి వెళ్లి 4 రోజుల తరువాత మందు తాగిన సమాచారం తెలిపిన గోపిని తండ్రి శంకర్ గుంటూరులోని సర్వజనాస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున గోపి మరణించాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. కాగా మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు.

మిరప రైతులకు సూచనలు

విశాలాంధ్ర-యడ్లపాడు : ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాలకు మిరప పైరులో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులను చిలకలూరిపేట ఉద్యానవన శాఖాధికారి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధానంగా మూడు రకాల తెగుళ్లు ఆశిస్తాయని వివరించారు. వేరు కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పైరు మొదలు బాగా తడిసేటట్లు చల్లాలన్నారు. కాయ కుళ్ళు, కొమ్మ ఎండు తెగులు నివారణకు టెబుకొన జోల్ 50 శాతం, ఫోక్సిస్ట్రోబిన్ 25 శాతం, 80 గ్రాములను ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాములు, ప్లాంటా మైసిన్ ఒక గ్రాము ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయడం వలన బ్యాక్టీరియల్ ఆకుమచ్చ తెగులును సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు. అధిక వర్షాల సమయంలో మిరప మొక్కలు సాధారణంగా భూమిలో నుంచి పోషకాలను గ్రహించడంలో ఇబ్బందులు ఎదురవుతాయని, పోషక లోప నివారణకు పైపాటగా 19 19 19, ఫార్ములా 4, ఫార్ములా 6, మెగ్నీషియం సల్ఫేటును పిచికారి చేయాలని వివరించారు. వర్షాలు ఆగిన వెంటనే పొలంలో అంతర కృషి చేయాలని రైతులకు సూచించారు.

చిరు వ్యాపారికి టిఫిన్ బండి...

విశాలాంధ్ర-తాడేపల్లి : కుంచనపల్లి గ్రామంలో చిరు వ్యాపారి గంధం సాంబశివరావు(టిఫిన్ వ్యాపారం)నకు జీవనోపాధి నిమిత్తం తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పంపించిన టిఫిన్ బండిని కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు అందజేశారు. తనకు జీవనోపాధి నిమిత్తం టిఫిన్ బండి అందజేసినందుకు నారా లోకేష్‌కి గంధం సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు అమరా సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, కుంచనపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బిరుదుగడ్డ రమేష్, దాసెట్టి అరుణ, శేషంశెట్టి శ్రీనివాసరావు, కొలంటి మాణిక్యాలరావు, మారుమాక రాజేష్, కొమ్మోజి కృష్ణబాబు, భూపతి సుబ్బారావు, కుక్కమళ్ల సాగర్, బుల్లా బంగారయ్య, అమ్మిశెట్టి సుబ్రహ్మణ్యం, తుమ్మపూడి వినోద్, నాగదేసి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్ అధికారుల పోస్టుల భర్తీకి తీసుకున్న చర్యలేమిటి?

విశాలాంధ్ర-గుంటూరు : దేశంలో ఖాళీగా ఉన్న ఐఏఎస్ అధికారుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ విధివిధానాలపై బుధవారం జరిగిన లోక్‌సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రశ్నించారు. ఇందుకు సంబంధిత మంత్రిత్వ శాఖ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చింది. సివిల్ లిస్ట్ 2022 ప్రకారం ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌లో రాష్ట్రాల వారీగా మంజూరైన బలం, అధికారుల సంఖ్య వరుసగా 6789, 5317 అని తెలిపారు. బస్వాన్ కమిటీ సిఫార్సుల ఆధారంగా సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్(సీఎస్ఈ) ద్వారా వార్షిక ఇన్‌టేక్‌ను 180కి ప్రభుత్వం పెంచిందని మంత్రి సమాధానమిచ్చారు. ప్రమోషన్ కోటాలో ఖాళీలను భర్తీ చేయడానికి, రాష్ట్ర ప్రభుత్వాలతో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెలక్షన్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తుందని, అన్ని విభాగాల్లో భర్తీ చేయని పోస్టులను సకాలంలో భర్తీచేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయని వివరణిచ్చారు.

ఫాగింగ్‌తో దోమల నివారణ...

విశాలాంధ్ర-రెంటచింతల : ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యగా గ్రామాలలో ఫాగింగ్‌తో దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ గౌసియాబేగం అన్నారు. బుధవారం ఆమె స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఫాగింగ్ యంత్రాల పనితీరును పరిశీలించి మాట్లాడారు. గ్రామాలలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ తదితర పలు కాలనీలలో నున్న సైడ్ కాలువలు, మురుగుకుంటలపై ఫాగింగ్ చేయించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆమె పేర్కొన్నారు. మన నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లు అయితే విష జ్వరాలు, అంటువ్యాధులు దరిచేరవన్నారు. మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న హోటళ్ల నిర్వాహకులు, చిరువ్యాపారులు వ్యర్థపదార్థాలను రోడ్లపై వేయకుండా పారుశుద్ధ్య కార్మికులకు సహకరించాలని ఆమె కోరారు. ఈఓపీఆర్డీ రామచంద్రరరావు, పంచాయితీ కార్యదర్శులు జె.అనంత కోటేశ్వరరావు, వెంకయ్య తదితరులున్నారు.

దేవదాయ శాఖ మంత్రి, కలెక్టర్‌కు మాజీ ఎమ్మెల్సీ లేఖ

విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : పేరం గరుడాచలం నాయుడు ప్రాంగణములో కర్మల్ షెడ్యూల ప్రక్కన పిండ ప్రధానలకు ఆటంకంగా ఉన్నటువంటి రోడ్డు మరమ్మత్తుల యంత్రాలను ఇబ్బందులు లేకుండా చేయాలని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ కు, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్‌కు మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ లేఖ రాశారు. దేవదాయ శాఖ భూములు భక్తులకు సౌకర్యంగా ఉండాలి గాని ఇలా ఆటంకంగా ఉండకూడదని సూచించారు. స్థలదాత పేరం గరుడాచలం నాయుడుపై గౌరవంతో భక్తకోటి సమస్యను పరిష్కరించాలని లేఖ ద్వారా కోరారు.

భూముల రీసర్వేలో మండలాన్ని ముందుంచాలి

విశాలాంధ్ర-దుర్గి: భూముల రీసర్వే కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసి మండలాన్ని ముందంజలో ఉంచాలని తహశీల్దార్ జి.రమేష్ కుమార్ ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం భూముల రీసర్వే పై జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఎటువంటి పొరపొచ్చాలకు తావులేకుండా, పారదర్శకంగా భూములు రీసర్వే కార్యక్రమం ఉత్సాహంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం మండల సర్వేయర్ పవన్ కుమార్ రీసర్వే చేసే విధానము గురించి అవగాహన కల్పించారు. మండల పరిధిలోని నిదానంపాడులో రీసర్వే కార్యక్రమాన్ని గురువారం సర్వేయర్ పవన్ సంబంధిత సిబ్బందికి క్షేత్రస్థాయిలో చేసి చూపించనున్నారు. సర్వే సిబ్బంది ఉదయం నిదానంపాడుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, సచివాలయ డిజిటల్, వేల్ఫేర్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇదేం ఖర్మ గిరిజన కుటుంబాలకు: మేడా

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ పాలనలో ఇదేం ఖర్మ గిరిజన కుటుంబాలకు అని గిరిజనులు వాపోతున్నారని జిల్లా టీడీపీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మేడా రామకృష్ణ అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ హయాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు గిరిజన కుటుంబాలకు పెద్ద కొడుకులాగా అండగా ఉన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నెల రోజుల్లో కొత్త పెన్షన్లు, గిరిపుత్రిక ఎస్టీలకు పెళ్లి కానుక క్రింద పెళ్లి పీటల పైనే రూ.50 వేలు ఇచ్చారు. పేదవాడికి మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్, జగ్జీవన్ జ్యోతి పథకం క్రింద గిరిజనులకు 100 యూనిట్ల ఉచిత కరెంట్ ఇచ్చారు. గిరిజనుల జీవన ఆధారమైన గొర్రెలను, గేదేలను, పందులను పెంచుకోవడానికి షెడ్లు, సబ్సిడీ లోన్లు ఇచ్చారు. ఎస్టీ కాలనీల్లో దాదాపు 80శాతం మౌళిక వసతులు పూర్తి చేవారు. ప్రస్తుత వైసీపీ పాలనలో సంక్షేమ పథకాలు రాకపోగా వున్న పథకాలను కూడా తొలగించడం, గిరిజనులకు చదువును దూరం చేయడం, దాడులు పెరిగిపోయాయని అన్నారు. గిరిజనుల అభివృద్ధిని... జీవన ప్రమాణాలను అణిచివేసిన వైసీపీ ప్రభుత్వానికి గిరిజనులు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

పంటల పరిశీలన

విశాలాంధ్ర-శావల్యాపురం : తుఫాను వల్ల తడిసిన వరి, మిరప, పొగాకు, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జ్ ఏఓ రామినేని రామారావు అన్నారు. మండలంలోని కారుమంచి, శానంపూడి, చినకంచర్ల, పిచకలపాలెం తదితర గ్రామాలలోని తుఫాన్ వల్ల నీట మునిగిన పంట పొలాలను బుదవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారుమంచిలో 9 ఎకరాలు, మతుకుమల్లిలో 40 ఎకరాలు, శానంపూడిలో 10 ఎకరాలు, చిన్నకంచెర్ల, పిచికలపాలెంలో 40 ఎకరాలలో వరి పంట కోత కోసినట్లు తెలిపారు. నీటమునిగిన వరిపంటకు లీటరుకు 50 గ్రాముల చొప్పున ఉప్పు ద్రావణం స్ప్రే చేసి మొలకలు రాకుండా చూడాలని తెలిపారు. వరి కొన్నిచోట్ల కిందకు పడిపోవడం జరిగిందని అవి లేతగా ఉండటం వలన వాటిని పైకి లేపి దుబ్బులుగా కట్టుకుంటే ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. మొక్కజొన్న పొగాకు పంటకు తెగుళ్ల వంటివి వచ్చినయెడల ప్లాంటోమైసిన్ 20 లీటర్ల నీటికి ఐదు గ్రాములు చొప్పున పిచికారి చేయడం వలన ఎటువంటి ఇబ్బంది ఉండదని అన్నారు. సచివాలయ వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు పంట పొలాలను సందర్శిస్తారని ఏవైనా ఇబ్బందులు ఉంటే వారిని సంప్రదించాలని అన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు రంగుమారిన, ఇంకేమైనా సమస్యలున్న ధాన్యాన్ని కూడా రైతుభరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రీసర్వే

విశాలాంధ్ర-శావల్యాపురం : దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా వందేళ్ల తర్వాత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పారదర్శకంగా భూముల రీ సర్వే పనులు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. మండలంలో జరుగుతున్న రీసర్వే పనులపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందితో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రికార్డు రూమ్‌ని పరిశీలించి అక్కడ పరిస్థితులను చూసి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే పనులు సకాలంలో పూర్తిచేసే విధంగా పనులు వేగవంతం చేయాలని రెవిన్యూ, సర్వే సిబ్బందికి సూచించారు. పల్నాడు జిల్లా వ్యాప్తంగా రీసర్వే జరుగుతున్నాయని, వీటిలో 289 మంది గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు పనిచేస్తున్నారని తుఫాను ప్రభావంతో గత మూడు రోజులుగా సర్వే పనులకు ఆలస్యం ఏర్పడిందన్నారు. రోజుకు 3 వేల ఎకరాలు లక్ష్యం పెట్టుకొనగా 1500 నుంచి 1600 వందల ఎకరాల రీసర్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు. మండలంలో కూడా రీసర్వే పనులు జరుగుతున్నాయని 21,737 ఎకరాలకు గాను 7,178 ఎకరాల రీసర్వ పనులు పూర్తియినాయన్నారు. గ్రామ కంతాలలోని స్థలాలకు పంచాయితీ కార్యదర్శి పత్రాలను మంజూరు చేస్తారని తెలిపారు. అనంతరం పిచికలపాలెం ఉప సర్పంచ్ మందూస్ తుఫాన్ వల్ల వరి, పొగాకు, మర్చి పంట దెబ్బతిన్నదని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పొలాలలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. తడిసిన ధాన్యం సైతం రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. జేసీ వెంట తాహశీల్దార్ షేక్ జాన్ సైదులు, డిప్యూటీ సర్వేయర్ తుంగా శ్రీనివాసరావు, వీఆర్వో రాథ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : రాష్ట్ర స్థాయిలో జరగబోయే యోగా, త్రోబాల్ క్రీడాపోటీలకు పెదకూరపాడు మండల పరిధిలోని 75 త్యాళ్ళూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ నూతలపాటి అరుణశ్రీ తెలిపారు. యోగా అండర్-14 విభాగంలో జె.ప్రశాంత్ రాజ్, ఈ.ఇషాంత్ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 22, 23 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా రామవరంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. త్రోబాల్ అండర్-14లో బి.భార్గవి, అండర్-17లో వి.లక్ష్మి హేమ ఎంపికయ్యారు. వీరు ఈ నెల 17, 18, 19 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లాలోని కమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాల హెచ్‌ఎం ఆంకాళ్ళ శాంత భూలక్ష్మి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురళికృష్ణ, పీసీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పద్మజ, ప్రవర్ధిని, పీడీ అరుణశ్రీ తదితరులు అభినందించారు.

కోనపై విమర్శలు చేస్తే సహించేది లేదు



విశాలాంధ్ర-బాపట్ల టౌన్ : కోన పెట్రోల్ బంకులపై విమర్శలు చేసే వారందరికీ వైసీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు నరాలశెట్టి ప్రకాష్ రావు వార్నింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా రథం బజార్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో నరాలశెట్టి మాట్లాడుతూ కోన పెట్రోల్ బంకులపై విమర్శలు చేసేవారు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. భారత్ పెట్రోల్ బంకు సమస్యకు చెందిన యజమాని తిలక్‌కు ప్రభుత్వం అందించిన అనుమతుల పత్రాన్ని పత్రికా ముఖంగా చూపిస్తూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాస్తవం తెలుసుకోకుండా మాట్లాడటం తన అవివేకానికి నిదర్శనమని అన్నారు. అలాగే తొలగించిన పెట్రోల్ బంకు మున్సిపాలిటీ రోడ్డు పరిధిలో ఉన్నదని ఎక్కడైనా మున్సిపాలిటీ రోడ్డు కోసం తొలగించిన వారికి స్థలాలు కేటాయించిన దాఖలాలు లేవని నరాలశెట్టి ప్రకాష్ రావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిలక్, రాజా, కిషోర్, పీర్, వెంకటేశ్వర్లు, మాల్యాద్రి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా అన్నారు. బుధవారం తూర్పు నియోజకవర్గం 13వ డివిజన్ సంగడిగుంటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తున్న సంక్షేమ పథకాలుపై అవగాహన కల్పించారు. ప్రజల వద్దకు నేరుగా వెళ్ళి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నామన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముస్తఫా చెప్పారు.

గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా వైసీపీ ప్రభుత్వంలోనే అధికారం వచ్చిన సమయం నుంచి ప్రజల్లోనే ఉండి వారికి మెరుగైన సేవలు అందిస్తూ వారి గడప వద్దకే వెళ్ళి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

వామ్మో మునగ!

కిలో రూ. 200 చేరిన ధర

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ఆరోగ్యంగా జీవించడానికి కావల్సిన అన్ని రకాల పోషక పదార్థాలు, ఎన్నో ఔషద గుణాలు విలువలు కలిగి, వ్యాధి నిరోధక శక్తి మేరుగు పర్చడంలో ఎంతో దోహదపటే మునగకాయ కూరంటే ఇష్ట పడనివారంటూ ఉండరు. మునగకాయతో పప్పుచారు కాసుకుంటే ఆ రుచేవేరు. మటన్‌లో కలిపి కూరచేస్తే ఆహా ఏమిరుచి అంటూ పోటీపడి లాగిస్తుంటారు. అలాటి మునగకాయలను నేడు మార్కెట్‌లో ముట్టుకోవాలంటేనే భయమేసి పోతుంది. మొన్నటి వరకు మూడు రూపాయలకు లభించిన మునగకాయ నేడు రూ. 20లు పలుకుతుంది. మార్కెట్‌లో కిలో మునగకాయలు రూ. 200లకు పెరిగి నాదరికి వస్తే నడుములు విరుగుతాయంటుంది.

దక్షిణ భారతీయుల మది దోచిన కూరగాయల్లో మునగకు ఓ ప్రత్యేకత ఉంది. మునగా కాపు లేకపోవడంతో మునగకాయల ధరలు ఆకావాన్ని తాకుతూ ధనవంతులకు సైతం దొరకనంటున్నాయి. నెల రోజుల క్రితం వరకు కిలో రూ. 50 లకు లభించిన మునగకాయలు ధరలు చుక్కలను తాకుతున్నాయి. ధరలు మండుతున్న నాణ్యమైన కాయలు లభించడం లేదని అటు వ్యాపారులు, ఇటు వినియోగదారులు అంటున్నారు. పది రోజుల క్రింత కిలో రూ. 100 లు ఉన్న మునగకాయలు ధర నేడు రూ. 180 నుంచి రూ. 200 లకు చేరుకుంది. ఇంత ధర చెల్లించినా నాణ్యమైన కాయలు అభించడం లేదు. ఇదిలాఉంటే మరో వైపు కృష్ణా, గుంటూరు జిల్లాలో కాపు కూడ లేక పోవడం ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారులు అంటున్నారు. మునగకాయతో పప్పుచారు కాసుకుందాంమట్టే ఒక కాయ రూ. 20 నుంచి 25 రూపాయలపై మాటే దీంతో మునగకాయ వంక చూడాలంటేనే వినియోగదారులు బయపడిపోతున్నారు. మునగకాయలతో పాటు కూరగాయల ధరలు మండుతున్నాయి. కూరగాయల ధరలు ఎప్పుడు తగ్గుతాయోనని వినియోగదారులు ఎదురు చూస్తున్నారు. అయితే మరో రెండు నెలల వరకు కూరగాయల ధరలు దిగిరావని వ్యాపారులు అంటున్నారు.

ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచిన సీఎం

విశాలాంధ్ర-తెనాలి : సంక్షేమ క్యాలెండర్‌ను ప్రకటించి, దానిని పక్కగా అమలు చేస్తూ పేద ప్రజల జీవన ప్రమాణాన్ని పెంచిన మహనీయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి అని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 3వ వార్డు ఈటీ కాలనీ నుంచి బుధవారం ఉదయం ప్రారంభించారు. మూడోవ వార్డు వైఎస్ఆర్‌సిపి కౌన్సిలర్ ఆవుల కోటయ్య, మూడోవ వార్డు వైఎస్ఆర్‌సిపి నాయకులు ఎమ్మెల్యే శివకుమార్‌కు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్ళి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాలనతో పేద ప్రజలకు భరోసా లభించిందన్నారు. ప్రభుత్వంపై ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు చేస్తూ తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. జగనన్న కాలనీలలో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణ పనులపై నూతనంగా నిర్మిస్తున్న తెనాలి బండ్‌పై మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. ఆయన ఎమ్మెల్యేగా తెనాలిలో పని చేసిన సమయంలో అక్రమాలు, అరాచకాలు పెరిగాయని, అందుకే ప్రజలు గత ఎన్నికలలో ఓడించి బుద్ధి చెప్పారని ఎద్దేవ చేశారు. ఇలాంటివి మానుకోవాలని, లేని పక్షంలో ప్రజలే మిమ్మును తరిమికొట్టే రోజులు త్వరలో వస్తాయని హెచ్చరించారు. టిడిపి ప్రభుత్వ పాలనలో 800ఇళ్ళు నిర్మించలేని వారు మొదటి విడత క్రింద 17వేల ఇళ్ళు నిర్మిస్తున్న తమపై విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, గుంటూరు కోటేశ్వరావు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పోరేషన్ డైరెక్టరు మన్నవ ప్రభాకర్, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, మొఘల్ అహ్మద్‌బేగ్, అత్తోట నాగవేణి, అన్నాబత్తుని పద్మజ, షేక్ ఇస్మాయిల్, కో ఆప్షన్ సభ్యులు పెబ్బింగ్ సుభాని, ఎంపీటీసీ చెన్నయ్య, 3వ వార్డు వైఎస్ఆర్‌సిపి నాయకులు షేక్ మీరావలి, షేక్ జాని, అంజి, సైదా, వెంకటేష్, జాకీర్, నాగేశ్వరావు, దుర్గ, రఫీ, కాళీ, నరేంద్ర, వైఎస్ఆర్‌సిపి నాయకులు బొమ్ము నాగిరెడ్డి, దేసు శ్రీనివాసరావు, కాకిదేవ సహాయం, అక్కిదాసు కిరణ్, అదుసుమల్లి శ్రీనివాసరావు, కోలా వాసు, కృష్ణారెడ్డి, కతారి హరీష్, కొమ్ము రాయల్, మట్లపూడి రాజేశ్వరరావు, అత్తోట శ్యామ్, ఎల్‌బీసీ చిన్నా, పులువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోం కంపోస్టుకు ముందుకు రావాలి



విశాలాంధ్ర-తెనాలి : పట్టణంలోని ప్రతి గృహిణి తమ ఇండ్ల నుండి వచ్చే తడి చెత్తలను, హెూమ్ కంపోస్టుగా తయారు చేయటానికి ముందుకు రావాలని మున్సిపల్ కమీషనర్ ఎం.జస్వంతరావు కోరారు. క్లాప్ ప్రోగ్రాంలో భాగంగా ఐఇసి యాక్టివిటీస్‌ను పట్టణంలోని బుధవారం 13వ వార్డులోని కమ్యూనిటీ హాల్ నందు ఎస్‌హెచ్‌జి సభ్యులకు హెూమ్ కంపోస్టు విధానంపై అవగాహన కల్పించి ప్రతి ఒక్కరూ తమ ఇండ్ల వద్ద హెూమ్ కంపోస్టు విధానం పాటించునట్లు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, శానిటరీ సెక్రటరీలు టి.పాల్‌భూషణ్, డి.సాగరయ్య, ఎన్.ప్రవీణ్‌కుమార్, యం.శాంతిప్రియదర్శిని, కె.సంధ్య, కె.సురేష్, నగర దీపికలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి తాపీ వర్కర్స్ సాయం

విశాలాంధ్ర-తెనాలి : కార్మికుల ఆకస్మిక మృతి చెందితే దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబ సభ్యులకు తాపీ వర్కర్స్ యూనియన్ సభ్యులు అండగా నిలిచారు.మృతుడు కరిములా భార్యకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. మేడికొండ ఆశీర్వాదం, మాదాల శివన్నారాయణ, కేవై రాజు, ఉపాధ్యక్షులు మైలా నాగరాజు, ప్రధాన కార్యదర్శి దొడ్డెంపూడి నాగరాజు, నక్కా వేణుగోపాల్ మరియు యూనియన్ కమిటీ సభ్యులు కేతావత్ బాలు నాయక్, షేక్ బాషా, వేములపల్లి రాఘవ తదితరులు కరిముల్లాకు నివాళులర్పించారు. యూనియన్ సభ్యులు ఆర్థిక సహకారం అందజేసి ఆదుకోవటం చాలా గొప్ప విషయమని కార్మికుని భార్య షేక్ బేగం తెలిపారు.

చంద్రబాబు పిచ్చి పట్టి తిరుగుతున్నాడు: మంత్రి సిదిరి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు పట్టణం నిడుబ్రోలులో రాష్ట్ర పశుసంవర్థక, మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు బుధవారం రూ.87 లక్షలతో నిర్మించిన పశు వైద్యశాలను ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో సంక్షేమ పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు చూసి పిచ్చెక్కి తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడుకు ఆ గతి పట్టించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై ఆయన చలోక్తులు విసిరారు. ముఖ్యమంత్రి నవరత్నాలు ప్రకటించిన రోజు హేళన చేసిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే అవే పథకాలు అమలు చేస్తామనటం సిగ్గుమాలిన ప్రకటనని అన్నారు. వయస్సు మీద పడి పిచ్చి పట్టి ఏం మాట్లాడుతున్నాడో అర్థం కాని పరిస్థితిలో చంద్రబాబు నాయుడు ఉన్నాడని రాష్ట్ర ప్రజలు అంటున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో సహకార సంఘాలను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి దోచుకున్నారని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాల డెయిరీలను ప్రైవేటుకు దారాదత్తం చేసేందుకు జీవోలు తెచ్చిన ఘనుడు చంద్రబాబు అని గుర్తుచేశారు. జిల్లాలో ఉన్న సంగం డెయిరీ రైతుల కష్టమని దానిని ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ స్వాధీనం చేసుకోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో సంగం డెయిరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. పాడి రైతులు నూతన పశు వైద్యశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భవనం పద్మలీల తదితరులు పాల్గొన్నారు.

కష్టేఫలి...

ఎంత ఎదిగిన ఒదిగి ఉండే లక్షణం

విశాలాంధ్ర - బాపట్ల : రోజు ఉదయాన్నే నిద్ర లేవటం చద్ది అన్నంలో పెరుగు వేసుకుని తినటం సైకిల్‌పై సీజన్‌ను బట్టి గోంగూర, వేరుశనగ కాయలు, కాయగూరలు, పూలు ఊరూరు తిరిగి అమ్మి ఇంటికి వచ్చి రెడీ అయి స్కూల్‌కి వెళ్లటం ఇదీ నేడు విశాఖ నగర హోంగార్డుల డీఎస్పీగా పదోన్నతి పొందిన కర్లపాలెం మండలం దుండివారిపాలెం గ్రామానికి చెందిన దుండి ఏడుకొండలరెడ్డి ప్రస్థానం. జిల్లాలోని కర్లపాలెం మండలం దుండివారిపాలెం గ్రామానికి చెందిన దుండి సుబ్బారెడ్డి, ఆదిలక్ష్మి వృత్తిరీత్యా వ్యవసాయ కార్మీకులు. వీరు రోజువారీ కూలీకి వెళు తూ కౌలుకు పోలం తీసుకుని ఆకుకూరలు, కాయగూరలు పండిస్తూ జీవనం సాగించే వారు. వీరికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో ఏడుకొండలరెడ్డి ద్వితీయ సంతానం. చిన్ననాటి నుంచే ఏడుకొండలరెడ్డి కష్టపడి పనిచేస్తూ చదువుపై మక్కువతో కాలి నడకనే విద్యాభ్యాసం కర్లపాలెం, పిట్టలవానిపాలెం, చెరుకుపల్లి మండలాలలో సాగింది. చదువుతో పాటు, క్రీడలు, కళారంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకటో తరగతి నుండి డిగ్రీ వరకు విద్యనభ్యసించి ఉద్యోగం చేస్తూ నిత్య విద్యార్థిలా ప్రవేటుగా చదువును కొసాగిస్తున్నారు. 1991లో ఏఆర్పీగా ప్రభుత్వ ఉద్యోగం తొలి ప్రయత్నంలోనే సాధించి 1996లో పదోన్నతి పొందారు. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో విధినిర్వహణలో భాగంగా దట్టమైన అడవులలో అప్పట్లో కాలి నడకనే విధులు నిర్వహించారు. 2016 వరకు హైదరాబాద్‌లో ట్రాఫిక్ సీఐగా ఉద్యోగం నిర్వహించారు. ఏడుకొండలరెడ్డి విధి నిర్వహణలో నిబద్ధతో పని చేసి ఉన్నతాధికారుల చేత ప్రశంసలు అందుకుంటూ ఐదుగురు కమిషనర్లు, నలుగురు రాష్ట్ర డీజీపీల నుంచి సత్కారం అందుకున్నారు. సీఆర్డీఏ సెక్యూరిటీ అధికారిగా, ముఖ్యమంత్రి ఎస్కార్ట్ అధికారిగా ఏడుకొండలరెడ్డి విధులు నిర్వహించారు. స్వంత గ్రామంలో ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ యువతను ఉద్యోగాల వైపు ప్రోత్సహిస్తూ సామాజిక సేవా కార్యక్రమాలు నేటికి చేస్తూ ఎంతో మంది మన్నలను పొందారు. దుండి ఏడుకొండలరెడ్డి. తల్లిదండ్రులు సుబ్బారెడ్డి ఆదిలక్ష్మి సర్పంచులుగా పంచాయితీని ఉత్తమ పంచాయితీగా తీర్చిదిద్దారనటంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఏడుకొండలరెడ్డి డీఎస్పీగా పదోన్నతి పొందటంపై బాపట్ల నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లను నిరాశపరచిన రాష్ట్ర క్యాబినెట్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లను నిరాశకు గురి చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ)జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాష ఆవేదన వ్యక్తంచేశారు. గుంటూరు మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ఏపీ జీఈఏ గుంటూరు జిల్లా కార్యాలయము నందు పత్రికా సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సయ్యద్ చాంద్‌భాష మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ వేళ రాష్ట్ర క్యాబినెట్‌లో ఒక్క డీఏ కూడా ప్రకటించకపోవడం చాలా దారుణమన్నారు. అలాగే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు ప్రాధాన్యత అంశంగా ప్రభుత్వం తీసుకోకపోవడం బాధాకరమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలపై దృష్టి పెట్టి ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యత అంశంగా చేర్చి ఉద్యోగులకు డిఏలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ జీఈఏ జిల్లా ఆర్గనైజ్ సెక్రెటరీ కరీముల్లా షా ఖాదిరి, నగరశాఖ అధ్యక్షులు వై.నాగేశ్వరరావు, నగరశాఖ ఉపాధ్యక్షులు వి.పెదరత్తయ్య, జిల్లా కార్యదర్శి ఎల్.భారత్, అమరావతి తాలూకా అధ్యక్షులు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తడి చెత్తపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా తడి చెత్తపై ప్రజలకు అవగాహన ఉండటం ఎంతో అవసరమని 4వ డివిజన్ కార్పొరేటర్ షేక్.మహమూద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం 4వ డివిజన్ 9వ సచివాలయం పరిధిలో కార్పొరేటర్ మహమూద్ ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహమూద్ మాట్లాడుతూ తడి చెత్తను ఇంట్లోనే ఎరువుగా మార్చి మొక్కలు పెంచుకునే విధంగా స్థానికులకు అవగాహన కల్పించారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ముస్తఫా ఆదేశాలతో...నగర మేయర్ కావేటి మనోహర్‌నాయుడు సూచనలతో 4 వ డివిజన్ 9వ సచివాల పరిధిలో తడి చెత్త విషయంలో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐజాక్, శానిటరీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాలలోనే ప్రసవాలు జరగాలి

విశాలాంధ్ర-దుర్గి : ప్రభుత్వ వైద్యాశాలలోనే నూరు శాతం ప్రసవాలు జరిగే విధంగా ఆశాలు పనిచేయాలని దుర్గి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ సతీష్ అన్నారు. ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆశా కార్యకర్తలకు ఓఇఇఇపై జరుగుతున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మార్తమ్మ మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు సంరక్షణ గురించి ఆశాలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత కుమారి, దుర్గి పీహెచ్‌సీ పరిధిలోని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణంలో డీఎస్పీగా పనిచేస్తూ బదిలీ అయిన విజయ భాస్కర్ రెడ్డిని వైసీపీ నాయకులు వెలుగూరి శరత్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పట్టణంలో గాని ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంటికి రెప్పలా కాపాడారన్నారు. ఎవరైనా సహాయం కోసం వస్తే భరోసా కల్పించి వారికి ధైర్యం చెప్పి వారికి తగిన న్యాయం చేసేవారన్నారు.